


జానకి బయట మొక్కల మధ్య కుర్చీ వేసుకుని కూర్చున్నది . .

భానుమూర్తి యింకా యింటికి రాలేదు వాళ్ల ఫ్యాక్టరీ నుంచి

వాతావరణం చల్లబడ్డది.. ..

రోజులో – ఆహ్లాదపరిచే వుదయమూ, చురుకుగా వుండే మధ్యాహ్నమూ దాటి. చల్లగా వుండే సాయం సమయానికి చేరుకున్నాడు దినకరుడు

సాయం సంధ్య బంగారు రంగు చీరె కట్టుకుని, లోకం మీదికి వస్తున్నది

సంధ్య రాకకి స్వాగతం పలుకు తున్నాయి చల్లని గాలి, తెల్లని మల్లెలూ ..

ఇప్పటికి తన వయసు– యౌవనం దాటి ... నడి వయసులో పడ్డది– ప్రస్తుతం వున్న వాతావరణం లాగానే. .. అనుకున్నది జానకి.. .

జానకి మెదడు గతంలోకి పరుగులు తీసింది– ఆ రోజు వుదయం జరిగిన సంఘటనల ఫలితంగా–

★ ★ ★ ★

జానకి యిరవై ఏళ్ల వయసులో వుంది. . డిగ్రీ అయిపో వచ్చింది...

"నీకు పెళ్లి చేస్తానమ్మా!" అన్నారు జానకి తండ్రి . పాతిక సంవత్సరాలు వెనక..

"నాన్నా! నేను రాజుని పెళ్లి చేసుకుంటాను" అన్నది జానకి.

"ఏ రాజు?" తెలియనట్లుగానే అడిగారు రామారావు గారు.

"ఎదురుగా మేడమీద వుంటున్నాడు నీకు తెలుసు కదా నాన్నా!" తెలియనట్లుగా అడిగిన తండ్రి ప్రశ్నకు కాస్త ఆశ్చర్యపోయినా, మృదువుగానే అన్నది జానకి

"వద్దు. .." ఏ వుపోద్ఘాతమూ లేకుండానే ఖచ్చితంగానే అన్నారు

"రాజు చాలా మంచివాడు నాన్నా! ఉద్యోగం కూడా చేస్తున్నాడు కట్నాలూ, కానుకలూ అక్కర లేదు ." నచ్చ చెప్పటానికి ప్రయత్నించింది జానకి

ఏం మాట్లాడకుండా బయటికి వెళ్లిపోయారు రామారావు గారు..

★ ★ ★ ★

రాత్రి భోజనాలు అయినాయి అందరూ హాల్లో కూర్చున్నారు

జానకి, యిద్దరు చెల్లెళ్ళూ, ఒక తమ్ముడూ, తల్లీ, తండ్రీ. ..

"జానకీ! నువ్వు పొద్దున్న అడిగిన ప్రశ్నకి యిప్పుడు ఖచ్చితమైన సమాధానం చెబుతానమ్మా! దాన్ని గురించే వుదయం నుంచి ఆలోచించి నేనొక నిర్ణయానికి వచ్చాను!" చాలా శాంతంగా వున్నది ఆయన ధోరణి.

"ఏమిటి నాన్నా?" జానకిలో ఆశ రేగింది, ఆనందమూ కలిగింది, తండ్రి ధోరణికి.

రెండు నిముషాలు నిశ్శబ్దం నిలబడి పోయింది.

"రాజుని చేసుకుంటా నన్నావు కదా!" అని ఒక క్షణం ఆగారు

"కుదరదమ్మా!" అన్నారు.

జానకిలో రేగిన ఆశ అణగారి పోయింది నిరుత్సాహం తల ఎత్తింది

"ఎందుకని నాన్నా?"

"అతని ఆస్తులూ, అంతస్తులూ వదిలెయ్యి... అవి నాకు అంతగా పట్టింపు లేవు.. అతని కులం వేరూ, మన కులం వేరు. అతనికి నా అనేవాళ్ళు ఎవ్వరూ లేరు దాదాపు అనాధ లాంటి వాడు.

మనిషి ఎంత మంచివాడైనా– సమాజంలో బ్రతకటానికి, వాడికి కొన్ని బేసిక్ అర్హతలు కావాలి నా దృష్టిలో ...

అతనితో నీ పెళ్లి జరిగితే–

నీ చెల్లెళ్ళూ, తమ్ముడూ.... వాళ్లకి మంచి భవిష్యత్తు వుండదు . నీ పెళ్లితో వాళ్ల భవిష్యత్తు తగులుకుని వున్నది.

ఆ తరువాత – వాళ్ళ జీవితంలో నానా అవస్థలూ పడుతూ వుంటే– నువ్వు ఎంత ప్రేమించి పెళ్లి చేసుకున్నా సుఖంగా వుండలేవు. రాజునీ సుఖపెట్టలేవు. ఇప్పుడు నీకు తెలియదు గానీ. నీ స్వార్థం కంటే కూడా నీ వాళ్ల జీవితాలూ, వాళ్ల భవిష్యత్తూ. .. ఎక్కువ బలమైంది.

మనం వున్న సమాజం అలాంటిది. తప్పదు మరి .. నాకూ ఎన్నో ఆశలూ, ఆలోచనలూ. ఆదర్శాలూ వున్నాయి. కానీ– నేను పిరికివాడ్ని. నా పిరికి తనమే నీకూ నేర్పుతున్నాను– అంటే యింక యీ విషయంలో మళ్లీ, మళ్లీ అడిగి, నువ్వు బాధపడి, నన్ను బాధ పెట్టద్దు.. . అంతే...." ఆయన మాటల్లో ఖచ్చితమైన నిర్ణయం వున్నది.

"నీ వన్నీ అపోహలు నాన్నా!... నువ్వనుకున్నంత ఘోరంగా లేదు యీ సమాజం.... నా పెళ్లి మూలంగా ఎవరి భవిష్యత్తూ పాడవదు" అని అనాలనుకున్న జానకి.. . ఆ మాటల్ని గొంతులో నుంచి బయటికి రానీయకుండా, మింగేసింది.

అక్కడి నుంచి మౌనంగా లేచి, వెళ్ళిపోయింది. రాత్రి ప్రక్క మీద పడుకుంటే– నిద్రరాలేదు.

'తన మనసులో అనుకున్నది..... ' తనకి నచ్చిన

పని.... తన కోరిక... అది చేయటానికి తనకి స్వేచ్ఛ లేదు.

ఎందుకిలా.... ? ... ఏమిటీ పరిస్థితి.....? చుట్టూ వున్న సమాజాన్ని నిలబెట్టి..... ఎందుకిలా నువ్వు అడ్డు వస్తున్నావు? అని ఈ సమాజాన్ని ప్రశ్నిస్తే.... ?

నిన్ను ప్రశ్నించే పని , అడ్డుపడే పని నాకేమిటి? నీ యిష్టం వచ్చినట్టు చేసుకో.... ఆతరువాత' నాపని నేను 'చూసుకుంటాను....' అని తప్పుకునే సమాజంలో వున్నది తను.

'ఇప్పటి వరకూ - చాలా మంది కంటే స్వేచ్ఛగా, హాయిగా పెరిగాను., తన తల్లితండ్రులూ తనకి కావలసినంత స్వేచ్ఛా స్వాతంత్ర్యాలు యిచ్చారు' అని మురిసి పోయింది తను.

'ఆ స్వేచ్ఛని తనేమి దుర్వినియోగ పరచలేదే?- ఇష్ట మొచ్చినట్టుగా ప్రవర్తించలేదే.....!

రాజు చాలా యోగ్యుడు. మంచి వాడు, తెలివి గలవాడు, సంస్కారవంతుడు. కష్టపడి చదువుకుని ఉద్యోగం సంపాదించు కున్నాడు. తన తండ్రే రాజుని చూసి మురిసి పోయాడు. తన తమ్ముడితో - "వొరే బాబూ! నువ్వు రాజు అంత మంచివాడివి కావాలిరా" అని ఆయన కొడుక్కి కూడా చెబుతారు.

అటువంటిది - తను రాజుని పెళ్ళి చేసుకుంటానంటే, తన యింటి అల్లుడిగా అంగీకరించాలంటే- ఎన్నో అభ్యంతరాలూ, వాటికి కారణాలూ చెప్పి, తన కోరికకి సంకెళ్ళు వేశారు.

ఇంకెక్కడి స్వేచ్ఛ!

తన తల్లి తండ్రుల పోషణలో.... వాళ్ళ నీడలో నే...., మొదటి సారిగా తన స్వేచ్ఛకి సంకెళ్ళు పడిపోయినాయి. ఆ రాత్రి కుమిలి , కుమిలి ఏడ్చింది జానకి.

★ ★ ★

తరువాత - మరో రెండు నెలలకి భానుమూర్తితో జానకికి పెళ్ళి జరిగి పోయింది.

# సంకెళ్ళు

మొదట్లో మనసు లేక పోయినా, పరిస్థితులకి రాజీ పడి పోయింది జానకి.

కొడుకు పుట్టాడు.

భానుమూర్తి మంచివాడు. అతని మంచి. తనంతో, సహకారంతో జీవితం సాఫీగానే గడిచి పోతున్నది..... ఎవరికైనా, ఏదైనా సహాయం చెయ్యగలిగే మంచి స్వభావం వున్నది భానుమూర్తికి.

ఆ తరువాత-

తన యింట్లో పని చేసే పని మనిషీ, మొగుడూ అకస్మాత్తుగా ప్రమాదంలో చచ్చిపోయారు.

అనాధగా మిగిలిపోయిన , తన పనిమనిషి మూడేళ్ళ కూతురిని చూసి, జానకి హృదయం ద్రవించి పోయింది.

"ఆ పిల్లని మనం పెంచుకుందాం" భానుమూర్తిని అడిగింది జానకి....

"జానకి! ప్రతి చిన్న విషయానికి యింతగా చలించి పోతే ఎలా"?

అంతటితో వూరుకోక, 'అన్ని బాధ్యతలూ నెత్తిన వేసుకుంటా నంటే ఎలా చెప్పు.....!'

మృదువు గానే అన్నాడు భానుమూర్తి.

"ఏమైందండీ.... ?"

"ఆ పని పిల్లని పెంచుకుంటానంటే ఎలా మరి?"

"ఏలా ఏముంది? మానవతా దృష్టితో.... దాని తల్లి తండ్రులు పాచిపనులు చేశారు గనుక- అది పని పిల్ల అయింది.

పాపం వాళ్ళు చచ్చి పోయారు. దానికి 'నా' అన్న వాళ్ళు ఎవ్వరూ లేరు. కాస్త మానవతా దృష్టితో ఆలోచించి , ఆ పిల్లని మనం పెంచుకుంటే- అది మన పిల్ల అవుతుంది. దాని భవిష్యత్తు బాగుపడుతుంది.- లేకపోతే ఆ పసి పిల్ల , అందులో ఆడపిల్ల- నా అన్న వాళ్ళు ఎవ్వరూ లేని యీ సమాజంలో - భవిష్యత్తులో దాని బ్రతుకు నాశనమై పోతుంది.

దాన్ని మనం పెంచుకున్నందు వల్ల - మనం ఆర్థికంగా ఏమి నష్ట పోము... మీరు సరే నంటే.....'

బ్రతిమి లాడే ధోరణిలో అన్నది జానకి......

రెండు నిముషాలు ఆలోచించాడు భానుమూర్తి....

"జానకి ! నీ ఆలోచన బాగుంది.

ఆ పిల్లకి కావాలంటే - ఏంతో కొంత ఆర్థిక సహాయం చెయ్యి. అంతేకాని , ఆ పిల్ల బరువు బాధ్యతలూ, మంచి చెడులూ చూడట మనేది చాలా కష్టమైన పని.

ఎక్కువ బాధ్యతలూ, బాదర బందిలూ వుండకూడదనే మనం ఒక్క పిల్ల వాడితో నే మన కుటుంబాన్ని పరిమితం చేసుకున్నాం. నువ్వేమో పెంచుకుందాం అంటావు, మానవతా దృష్టి అంటావు...., ఏమిటిదంతా?"

"ఆ పిల్లకి కావలసింది - ఆర్థిక సహాయం కంటే - మోరల్ సపోర్ట్ కావాలి. ఆత్మీయతా, అనురాగం కావాలి.... ఆ బాధ్యతలన్నీ నేను పడతానుగా...." అర్థింపు ధ్వనించింది జానకి గొంతులో ....

"క్షమించు జానకీ- నాకు యిష్టం లేదు. నా భార్యగా నువ్వూ చెయ్యటం నాకు యిష్టం లేదు.... యింక నీ యిష్ట ప్రకారమే చెయ్యాలనుకుంటావా.... యింక బహుశ .... ఆ తరువాత ఎవరి దోవ వాళ్ళదే...." కొంత ప్రత్యక్షంగా, కొంత పరోక్షంగానూ తన అభిప్రాయాన్ని స్పష్టం చేశాడు భానుమూర్తి.

భానుమూర్తి సమాధానం విని, కృంగిపోయింది జానకి.

తెగించి, ధైర్యం చేసి, తన కోరికని అమలు పరచే స్వేచ్ఛ లేదు.

తనకి ఆర్థిక స్థోమతా లేదు. పోనీ- ఏ వుద్యోగమైనా చేసి, ఆ పిల్లని పెంచితే- తన భర్త నుంచి తనకి విడాకులు తథ్యం... తన కొడుక్కి తండ్రి ప్రేమని దూరం చెయ్యటం....

దీని మూలంగా ఏమిటి ప్రయోజనం? ఏమిటి సాధించ గలదు...? ఒక మంచి పని చెయ్యటానికి..... ముగ్గురిని బాధపెట్టటంలో - అర్థం ఎంత వరకూ వున్నది.... ?

తన యీ కోరిక- తన భర్త మంచివాడు.... తన కోరిక తీరుతుంది అనుకున్నది.

లాభం లేదు......


ఇక్కడా తన స్వేచ్ఛకి సంకెళ్ళు పడినాయి....

ఆ నాడు తన తండ్రి , ఈ నాడు తన భర్త.... తన కోరికకి, తన స్వేచ్ఛకి సంకెళ్ళు వేశారు.... ' బాధగా నిట్టూర్చింది జానకి.

★ ★ ★

కాల చక్రంలో మనసుకి తగిలిన చిన్న చిన్న గాయాల్ని మాన్పుకుంటూ ప్రశాంతంగానే నెట్టుకొచ్చింది కాలాన్ని. తనకి ఒక్కడే కొడుకు. చల్లని సంసారం. బాధ్యతలూ, బరువులూ లేవు.

తన కొడుకు రమేష్‌ని సంస్కార వంతుడిగా,



విజ్ఞత తెలిసిన వాడుగా, మంచివాడుగా పెంచాలనుకున్నది.

అలాగే పెంచింది. రమేష్ పెద్దవాడైనాడు. బాగా చదువుకున్నాడు. మంచి వుద్యోగం చేస్తున్నాడు.

తన కొడుకు మంచి తనం చూసి, తనే మురిసిపోతుంది జానకి.

ఎదిగిన కొడుకులో – ఎన్నో ఆశలూ, ఆదర్శాలూ చూసుకుంటుంది.

కొన్ని నెలలుగా తన మనసులో వున్న కోరికని రూపు దిద్దాలనుకున్నది జానకి.

రెండు సంవత్సరాలుగా.... ఎదురింట్లో వున్న మాధవిని చూస్తూనే వున్నది.

తన పెద్ద భవనం ఎదురుగా– ఓ చిన్న యింట్లో – రెండు గదుల రేకుల యింట్లో చిన్న వుద్యోగం కోసం ప్రయత్నిస్తూ.... తల్లితో కాపురం వుంటున్నది మాధవి.

దేముడి పూలకోసం – జానకి యింటికి వస్తూ వుంటుంది . బాగా పరిచయం అయింది. పరిచయాన్ని పరిమితంగానే వుంచుకున్న సంస్కార వంతమైన పిల్ల. చదువు కున్న పిల్ల– అందచందాలున్న పిల్ల.... తల్లీ తప్ప, ఆస్తి పాస్తులూ, నా అన్న వాళ్ళు లేని పిల్ల.

తల్లి వంటలు చేస్తూ వుంటే, మాధవి ఉద్యోగం కోసం వెతుకులాడుతూ అతి కష్టం మీద సంసారం నెట్టుకు వస్తున్న పిల్ల–

"మా అమ్మాయికి ఏదైనా ఓ వుద్యోగం యిప్పించండి. పెళ్ళి ఎలా అవుతుందో ఏమో – నా దగ్గర డబ్బూలేదు, నా అనే వాళ్ళూ లేరు". అన్న ఆ తల్లి అర్థింపులోని బాధని అర్థం చేసుకున్నది జానకి.

* * *

తన పెళ్ళి ఓ అనుభవం.....

అది గతం–

ప్రస్తుతంలో – మాధవిని తన యింటి కోడలుగా చేసుకోగలిగితే– అంత మంచి పిల్లని, చక్కని పిల్లని తనే తన కొడుక్కే ఎందుకు చేసుకో కూడదు....!

తన కోరిక..... తను రాజు విషయంలో చెయ్యలేని పని..... తన విషయంలో – తన పెంపకంలో పెరిగిన తన కొడుకు వింటాడను కున్నది.....

ఉదయం కాఫీలు అయినాయి. భానుమూర్తి, రమేష్ కూర్చుని వున్నారు.

"మాధవి బాగుంటుంది కదూ?" అని అడిగింది రమేష్‌ని.

"చాలా బాగుంటుంది. చాలా మంచి అమ్మాయి". అన్నాడు రమేష్.

"మరి .... నువ్వు పెళ్ళి చేసుకుంటావా రమేష్?" ధైర్యంగానే అడిగింది జానకి. ఒక్క సారిగా వులిక్కి పడ్డారు రమేష్, భానుమూర్తి కూడా.

"అదేమిటమ్మా! నీ ప్రశ్న చాలా సిల్లీగా వున్నదమ్మా!.... అలా ఎప్పుడూ ఆలోచించకు.

మాధవి మంచి పిల్ల.. బాగుంటుంది. చదువుకున్న పిల్లే. కాదనను. అంతమాత్రాన, నన్ను పెళ్ళి చేసుకోమనటంలో – మీనింగ్ లేదు"

"ఎందుకనిరా?"

"నా ఆలోచనలు నావి, నా కోరికలు నావి. వాటిని అమలు పరచుకోవటానికి నాకు స్వేచ్ఛ కావాలి.

మాధవికి కావాలంటే – సహాయం చెయ్యి, పెళ్ళి సంబంధాలు చూడు నీకు చేతనైతే. సహాయం చేద్దాం. అంతే కానీ....."

"అది కాదు రమేష్! ఇంతవరకూ నువ్వు ఎవ్వరినీ ప్రేమించలేదుకదా! అందుకే ధైర్యంగా అడిగాను.

అన్ని మంచి లక్షణాలున్న పిల్లకి.... ఎవరెవరినో సంబంధాలు చూసే కంటే– మన అబ్బాయికే చేసు కోవచ్చు కదా అనిపించింది. అందుకే– ఏ ఆదర్శమైనా ముందు మనం కూడా కొంత చెయ్యటంలో ఆనందం వున్నది....."

"అమ్మా! ఆదర్శాలు వుండటం– అందులో నీ ఆదర్శాలు మంచివే– కానీ – నీ ఆదర్శాలు నెరవేర్చుకోవటం నీ వరకే పరిమితం చేసుకో. నీకున్న స్వేచ్ఛ అంత వరకే.

నా గురించి అంటావా?..... నా వూహలు వేరు, నా కోరికలు వేరు. పెళ్ళి అనేది మనసుకి సంబంధించినది. నాకు మనసు లేనప్పుడు , నీ ఆదర్శం పేరుతో – నీ కోరికను చెల్లించి, ఆ తరువాత



# ఈ వేమన పద్యాలు




మందు దిను వరకు బథ్యము
పొందుగ నుండంగవలయు పుడమిం దానై
మందు దిని పత్యముడిగిన
నెందున నా వ్యాధి కుదర దిలపై వేమ

నా మనసుని బాధపెట్టు కోలేను. క్షమించమ్మా! నీ మాట కాదంటున్నందుకు. కొన్ని కొన్ని విషయాలకి కారణాలుండవు. ఒక వేళ వున్నా, చెప్పటం కష్టం. అయినా– మనసు సంగతి నీకేం తెలుసమ్మా!" నవ్వుతూ అన్నాడు రమేష్.

"అవునురా! మనసు సంగతి నాకేం తెలుసు" కళ్ళ జోడు సవరించుకుంటూ అన్నది జానకి.

"జానకి! అనవసరంగా రమేష్‌ని యిబ్బంది పెట్టకు. వాడి మాటల్లో వున్న యదార్థం కూడా ఆలోచించు. నాణేనికి రెండు ప్రక్కలా చూడాలి మరి..... నీ కోరికని వాడి నెత్తిన రుద్ది, అమలు పరచమనటానికి నీకేం అధికారం, స్వేచ్ఛా వున్నాయి చెప్పు...... నువ్వు అమ్మవేననుకో....... అయినా కూడా!" భానుమూర్తి కూడా నవ్వుతూనే అన్నాడు.

'మనసుసంగతి నీ కేం తెలుసమ్మా!' అన్న కొడుకు మాటలూ, నీ కోరికని నీ కొడుకు నెత్తిన రుద్దటానికి నీకేం స్వేచ్ఛా, అధికారం వున్నాయి అన్న 'భర్త మాటలూ ఉదయం నుంచీ జానకి మనసుని కలచి వేస్తున్నాయి.

'నిజమే .... ఎంత సున్నితంగా చెప్పినా, తన మనసులోది ఖచ్చితంగా చెప్పాడు రమేష్ .... వాడి జీవితం వాడిది.

స్వతంత్రించి తను అనుకున్న ఒక మంచిపని ఒక నక్కని ఆదర్శం చెయ్యటానికి.... యిప్పుడూ తనకి స్వేచ్ఛ లేదు.

పాతిక సంవత్సరాల నాడు.... , ఆ తరువాత, ఇప్పుడూ.... తనకి స్వేచ్ఛ ఎక్కడిది......

తన తండ్రి దగ్గర, ఆ తరువాత...., తన భర్త దగ్గర, ఇప్పుడు తన కొడుకు దగ్గర... తనకి స్వేచ్ఛలేదు.

ఎందుకని...? తను స్త్రీగా పుట్టినందుకేనా...? ఈనాడు ... రమేష్ తన పెళ్లి విషయంలో చెప్పినంత ఖచ్చితంగా – ఆనాడు రాజు విషయంలో ఎందుకు చెప్పలేక పోయింది తను?

ఒక అనాధను పెంచుకునే విషయంలో – తన భర్త తన అభిప్రాయాన్ని ప్రకటించి, తనని బెదిరించి అతని మాటని నెగ్గించుకున్నంత స్వేచ్ఛగా.... తనెందుకు చెయ్యలేకపోయింది...?

ఇంకెక్కడ వున్నది తనకి స్వేచ్ఛ? ఎక్కడ వున్నది లోపం? తను స్త్రీగా పుట్టినందుకా? తన ఆలోచనల్లోనా? తన కోరికల్లోనా?... తన తెలివితేటల్లోనా? ఈ సమాజంలో నా...? ..."

* * * * *

"ఆంటీ!" మాధవి పిలుపుతో – ఈ లోకంలోకి వచ్చింది జానకి.

సంధ్య కూడా జారిపోయింది. చీకటి చిన్నగా లోకంపైకి పాకుతున్నది.

"ఏం మాధవీ! కూర్చో!" అన్నది జానకి.

బంగారు బొమ్మ లాంటి మాధవిని చూసేసరికి – మరోసారి మనస్సు కలుక్కుమన్నది జానకికి.

"మా అమ్మ నాకు పెళ్లి నిశ్చయం చేసింది ఆంటీ!" అన్నది మాధవి.

'ఎవరమ్మా పెళ్లి కొడుకు?"

"ఆనంద్' అని... బ్యాంక్‌లో వుద్యోగం చేస్తున్నాడు. కానీ – అతనికి ఒక కాలు లేదు. కొంచెం కుంటివాడు. నన్ను చేసుకుంటానని వచ్చాడు. అతనికి ఎవరూ లేరు. అమ్మను కూడా చూసుకుంటానన్నాడు. ఆనంద్ చాలా మంచివాడు. ఒప్పేసుకున్నాను ఆంటీ!" అన్నది మాధవి. జానకి కళ్లలో నీరు తిరిగింది.

"వస్తాను ఆంటీ! పని వున్నది. మళ్లీ వస్తాను." అని వెళ్లిపోయింది.

"అతను కుంటివాడు ఆంటీ" అన్న మాధవి మాటలు మరోసారి జానకి చెవుల్లో గింగురుమన్నాయి.

"కుంటితనం ఆనంద్‌కి కాదు, తన మనసుది, తన కోరికది. స్వేచ్ఛలేని తన వ్యక్తిత్వానిది.

స్త్రీగా పుట్టి జీవితంలో – తండ్రి చాటుగా, భర్త చాటుగా, ఆఖరికి కొడుకు దగ్గర కూడా – తనకి స్వేచ్ఛ లేదు అంటే –

అసలు స్వేచ్ఛకి 'అర్థం' ఏమిటి? నా కూతురు సుఖంగా వున్నది అనుకునే తన తండ్రి–

నా భార్య నా సాహచర్యంలో ఆనందంగా, హాయిగా వున్నది అనుకునే తన భర్త – మా అమ్మ చాలా మంచిది, నాకు మంచి బుద్ధులు నేర్పింది, తల్లిగా నాకు స్వేచ్ఛ యిచ్చింది... మా అమ్మ గొప్పది అనుకునే తన కొడుకూ –

జానకి ఉత్తమ యిల్లాలు, ఆదర్శ గృహిణి అని అనుకునే సమాజంలో వున్నది తను.... నిజంగా వీళ్లకి .... వీళ్లల్లో ఏ ఒక్కరికైనా ఏం తెలుసు తను ఏం పోగొట్టుకున్నదో....! 'తనకు అసలు ఏం కావాలో...?' ఆలోచనలతో మెదడు మొద్దుబారిపోయింది. మనసంతా బాధగా వుంది... ఏదో ఆవేదన మనసుని కలచి వేస్తున్నది జానకిని.

అన్యమనస్కంగా తలఎత్తి ఆకాశం వైపు చూసింది.

విశాలమైన ఆకాశ వీధిలో – అక్కడక్కడా పక్షులు ఎగిరిపోతున్నాయి స్వేచ్ఛగా. జానకి మనసు మూగగా బాధ పడింది వాటిని చూసి..... □